క్లుప్తంగా

పేద విద్యార్థినికి సాయం



యామినికి ఫీజు రసీదు అందజేస్తున్న డీఎస్పీ

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన విద్యార్థిని బి.యామిని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీ సెకెండియర్ చదువుతోంది. పేద విద్యార్థి కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న అమెరికా వాసి గరిమెళ్ల విజయకుమార్ సాయం అందించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు డీఎస్పీ వివేకానంద చేతులమీదుగా మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చదువులో బాగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మిమిక్రీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గమ్యానికి దారి చూపారు



యూబీ పరిశ్రమ వద్ద హైవే సూచిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్...

రణస్థలం: కూటమి నాయకుల ప్రచార తీరును ఎండగడుతూ 'సాక్షి'లో ఈ నెల 3న 'గమ్యం చేరే దారేదీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి హైవే అధికారులు స్పందించారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల పరిధిలో ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలకు తూట్లు పొడుతూ ఏర్పాటు చేసిన కూటమి నేతల ఫ్లెక్సీలను తొలగించారు. గమ్యస్థానం దూరం వివరాలు తెలియక ఇబ్బందులు పడ్డ వాహనచోదకులు తాజా చర్యలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

45 మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరులో బెల్ట్ షాపులో అమ్మేందుకు తరలిస్తున్న 45 మద్యం బాటిళ్లను సోమవారం సాయంత్రం టాస్క్ ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. వీటిని తరలిస్తున్న కోటేశ్వరరావు అనే వ్యక్తిపై ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వి.సందీప్‌కుమార్ హెచ్చరించారు.

కూర్మనాథుని సన్నిధిలో ఆండవన్ స్వామీజీ



స్వామీజీకి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

గార: ఆదికూర్మ క్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని శ్రీరంగంకు చెందిన ఆండవన్ స్వామీజీ మంగళవారం దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం పల్లకితో ఎదురేగి స్వాగతం పలికారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు చామర్ల సీతారామ నృసింహాచార్యులు క్షేత్రమహత్యాన్ని వివరించారు. ఈవో కె.నరసింహనాయుడు స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ వెంకన్నగారిపేటలో మంగళవారం అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సీతారామచంద్రుల కల్యాణం, తిరువీధి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈసెట్



శివానీ కేంద్రంలో హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమో అనంతరం ఇంజినీరింగ్ రెండో ఏడాది లేటరల్ ఎంట్రీకి సంబంధించిన ఏపీ ఈసెట్- 2025 పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. చిలకపాలేంలో శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిప్టులో 250 మందికి 245 మంది, రెండో షిప్టులో 186 మందికి 180 మంది హాజరయ్యారు. ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కళాశాలలో ఒకే షిప్టులో 160 మందికి 157 మంది హాజరు కాగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. సెట్ నిర్వాహకులు పర్యవేక్షించారు .

- వార్షిక కల్యాణోత్సవాలకు సిద్ధమైన నారాయణ తిరుమల
- రేపటి నుంచి ఐదు రోజుల పాటు నిర్వహణ
- ప్రత్యేక ఆకర్షణగా 50 అడుగుల ఆంజనేయ, గరుడ, విశ్వరూపాల విగ్రహాలు
- రూ.2కోట్లతో శ్రీవారి పుష్కరిణి పనులు

రారండోయ్.. వేడుక చూద్దాం!



విద్యుత్ వెలుగుల్లో నారాయణ తిరుమల ఆలయం

శ్రీకాకుళం కల్చరల్ :

ఉత్తరాంధ్ర తిరుమలగా పేరుగాంచిన శ్రీకాకుళం పీఎన్ కాలనీలోని నారాయణ తిరుమల వార్షిక కల్యాణ మహోత్సవాలకు సిద్ధమైంది. ఇక్కడి వేంకటేశ్వరస్వామి ఆలయం నిత్య పూజలతో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతోంది. దేవదాయ ధర్మాదాయశాఖ పరిధిలో నిర్వహిస్తున్న ఈ ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు పాంచరాత్ర గమనం ప్రకారం నిర్వహించనున్నారు.

ఘన చరిత్ర

అప్పట్లో ఈ ప్రాంతం కొండలు, గుట్టలతో నిండి ఉండేది. నిర్మాణకర్త గురుగుబెల్లి నారాయన దాసు కలలో వేంకటేశ్వరస్వామి కనపడి శ్రీవారి పాద ముద్రలు ఉన్న ప్రదేశంలో ఆలయం నిర్మించమని ఆదేశించారని చెబుతుంటారు. తిరుపతి నుంచి భూనీళా సమేత వేంకటేశ్వరస్వామి విగ్రహాలను తీసుకువచ్చి 1961 ఏప్రిల్ 21 నుంచి 25 వరకు పాంచరాత్ర ఆగమ ప్రకారం ప్రతిష్ఠించారు. నాటి నుంచి నారాయణ తిరుమలగా ప్రసిద్ధిగాంచింది.

అద్భుత విగ్రహాలు..

ఇక్కడ 48 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, 52 అడుగుల గరుడాళ్వార్ విగ్రహం, 50 అడుగుల

కల్యాణోత్సవాలకు వేళాయె..

- ఈ నెల 7న సాయంత్రం స్వామివారి ఉత్సవ సంకల్పం, మంటపారాధన, ధ్వజారోహణం
- 8న శ్రీవారి వజ్రకవచ దర్శనం, సాయంత్రం భూనీళా సమేత వేంకటేశ్వర స్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవం
- 9న శ్రీవారి విశ్వరూప దర్శనం, క్షీరాభిషేక, మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు
- 10న శ్రీవారి స్వర్ణకవచ దర్శనం, విశేష ఆరాధన, సహస్ర నామార్చన, ఊయలసేవ
- 11న రజత కవచన దర్శనం, గరుడ వాహన సేవ, తిరువీధి
- 12న పుష్ప కవచ దర్శనం, అవభృత స్నానం, సాయంత్రం పుష్పయాగ మహోత్సవం
- ప్రతిరోజూ అఖండ విష్ణు సహస్రనామ పారాయణ

స్వామివారి విశ్వరూప దర్శనం విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. స్వామివారికి నిత్యం కైంకర్యాలను నిర్వహించేందుకు, వెయ్యి మంది భక్తులు ఒకేసారి వేడుకలను వీక్షించేందుకు మహామండపాన్ని ఆలయం పక్కనే నిర్మించారు. ఇందుకు సుమారు రూ.50 లక్షలు వెచ్చించారు. ఇక్కడే స్వామివారి కల్యాణ వేడుకలతో పాటు ఇతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయం చుట్టూ బేడా మండపాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దారు. దేవతామూర్తులు, స్వామివారి దశావతారాల విగ్రహాలతో అలరారుతోంది.

బంగారు, వజ్ర కవచాలు..

వేంకటేశ్వర స్వామి వైభవాన్ని చాటేందుకు భక్తులందరి సహకారంతో స్వామివారికి బంగారు కవచం, వజ్రకవచాన్ని సమకూర్చారు. వైరముడి కిరీటం, పూర్ణకుంభ కిరీటాలను ప్రత్యేక పర్వదినాలలో స్వామివారికి అలంకరింపచేసి భక్తులకు కనువిందు చేస్తారు.

చురుగ్గా పుష్కరిణి పనులు

ఇక్కడే రూ.2కోట్ల అంచనాలతో స్వామివారి పుష్కరిణి పనులకు శ్రీకారం చుట్టారు. రాళ్లు, గుట్టలను తొలగించి పుష్కరిణి నిర్మాణం చేపడుతున్నారు. ఇందులోనూ దేవతామూర్తుల విగ్రహాలు, కాళీయమర్దన బాల శ్రీకృష్ణమూర్తిని ప్రతిష్ఠించనున్నారు. ఆలయం బయట సుందర నందన వనం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొంత వరకు పనులు జరిగాయి.



స్వామివారి మూలవిరాట్



బేడా మండపంలో దేవతామూర్తులు



ప్రధాన ఆలయం

ఆలయాభివృద్ధికి కృషి



భక్తుల సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నాం. నారాయణ తిరుమలలో స్వామివారిని దర్శించుకునే వారికి సకల శుభాలు కలుగుతాయి.

– జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త

ఆధ్యాత్మిక కేంద్రంగా..



ఆధ్యాత్మిక కేంద్రంగా వర్ధిల్లుతున్న ఈ ఆలయంలో భక్తుల రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నాంఅష్టోత్తర శతనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– జి.శ్రీనివాసులు, ప్రధానార్చకులు, నారాయణ తిరుమల ఆలయం

ఉద్యోగాల్లో సమన్యాయం పాటించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: డి.మత్స్యలేశం పరిధిలో ఉన్న ప్రైవేట్ హేచరీని ఇటీవల విస్తరించారు. ఈ నేపథ్యంలో 20 వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నారు. అయితే మొత్తం ఉద్యోగాలు తమ వర్గానికే ఇవ్వాలని కూటమి నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారు. ఇదే సమయంలో స్థానిక సర్పంచ్ మూగి ఈశ్వర, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరాములు ఉద్యోగాల్లో అర్హత బట్టి సమన్యాయం చేయాలని, రాజకీయాలకు అతీతంగా హేచరీ నిర్వహించాలని, గ్రామ ప్రగతికి దోహదపడాలని చెబుతున్నారు. ఈ క్రమంలో అధికారులు ఇరు వర్గాలను చర్చలకు పిలిచారు. పోలీస్ అధికారులు సైతం శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇరు వర్గాలు రాజీకి రావాలని సూచించారు. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో రాజీ చర్చలు నిర్వహించారు.

ధర్మారావుకు సాహితీ అవార్డు

శ్రీకాకుళం కల్చరల్: చందు ట్రస్టు సాహిత్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికి గాను రచయిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుకు అందజేయనున్నట్లు సంస్థ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న విశాఖ పౌర గ్రంథాలయంలో అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

హోంగార్డు కుటుంబానికి సాయం



చెక్ అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వర్తించిన సింగూరు రాజేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి రూ. 4.04 లక్షల నగదు చెక్కును మంగళవారం అందించారు. జిల్లా హోంగార్డుల ఒక్కరోజు వేతనాన్ని ఈ విధంగా ఎస్పీ అందజేశారు.

ఎవరి ప్రయోజనాలకీ ప్రతిపాదన?


- గ్రంథాలయ భవన సముదాయం అన్యాక్రాంతం తగదు
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

శ్రీకాకుళం న్యూకాలనీ/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన సముదాయాన్ని అన్యాక్రాంతం చేసే దిశగా జరుగుతున్న ప్రతిపాదనలను పలువురు వక్తలు తీవ్రంగా ఖండించారు. ఎవరి ప్రయోజనాలకు ఈ ప్రతిపాదనలు తీసుకున్నారో చెప్పాలని, తక్షణమే నిర్ణయం ఉపసంహరించుకోకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని స్పష్టంచేశారు. జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం గొంటి గిరిధర్ అధ్యక్షతన జిల్లా కేంద్ర గ్రంథాలయ భవన సముదాయాన్ని అన్యాక్రాంత విషయమై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ ప్రతిపాదన అత్యంత అభివృద్ధి నిరోధకమైనదని, తిరోగమన మార్గంలో వెళ్లేదని సభ్యులు అభిప్రాయపడ్డారు. గ్రంథాలయ సంస్థ నిధులతో 1970లో ఎకరా భూమి కొనుగోలు చేసి నిర్మాణం చేపట్టారని, అప్పటి నుంచి వేలాది మంది పాఠకులకు, నిరుద్యోగ యువతకు ఆసరాగా ఉంటోందని, కళా, సంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ భవనాన్ని కూల్చవద్దని స్పష్టం చేశారు. అనంతరం గ్రంథాలయాన్ని కాపాడుకునేందుకును రిటైర్డ్ లైబ్రేరియన్ కె.బి.సుబ్రహ్మణ్యం కన్వీనర్‌గా జిల్లా కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కమిటిని 18 మంది ప్రతినిధులతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బి.ఎల్.నారాయణ విశాఖ జిల్లా పౌర గ్రంథాలయ సేవా సమితి అధ్యక్షులు, కె.త్రిమూర్తులురెడ్డి, సమితి ప్రధాన కార్యదర్శి పి.మల్లేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ ఉద్యోగ పెన్షనర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొంటి మురళీధర్, పి.తేజేశ్వరరావు (సీఐటీయూ), కొత్తకోట అప్పారావు (విశ్రాంత డిప్యూటీ డీఈఓ), కె.శ్రీనివాస్ (సాహితీ స్రవంతి), అట్టాడ అప్పలనాయుడు (రచయిత, కవి), బమ్మిడి శ్రీరామ్మూర్తి, సంపతిరావు కిషోర్‌కుమార్ (యూటీఎఫ్ నాయకులు), పి.ఖగేష్ (ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధి), పి.సుధాకర్ (గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం), ఎం.ప్రభాకరరావు (గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం), పార్వతీశం (ఆల్ పెన్షనర్స్, రిటైర్స్ సంఘం) తదితరులు పాల్గొన్నారు.

ఎందువలో చలివేంద్రం



చలివేంద్రం వద్ద నిర్వాహకులు

జి.సిగడాం: మండలంలోని ఎందువ-నర్సింహంపురం గ్రామాల ప్రధాన రహదారిలో మంగళవారం చల్లివేంద్రం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, సర్పంచ్ అల్లు జోగినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏర్నేన జ్యోతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు అభినందన



జ్ఞాపికలతో పదో తరగతి టాపర్లు

ఎచ్చెర్ల క్యాంపస్ : చిన్న కొంగరాంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఎంఈఓ కె.పున్నయ్య అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండ భాగ్యశ్రీ, సత్యసాయి సేవా సంఘం ప్రతినిధులు తవిటి రాజు, కమల, జనార్దన పాల్గొన్నారు.

చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారులు

గార: వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా గార శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎం.జనార్దణ, డి.ప్రసాద్, జి.కుమారస్వామి, చింతల సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామ దశకోటి మహాయజ్ఞం



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీరామ నామ దశకోటి మహాయజ్ఞం, హనుమాన్ చాలీసా కోటి పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక రామాయణ పారాయణ, గాయత్రీ, శ్రీరామ, హనుమాన్ మూల మంత్ర జపం జరిగింది. హనుమత్ ఉపాసకులు అన్నదానం చిదంబర శాస్త్రి, భాస్కరభట్ల శ్రీరామశర్మలను ఘనంగా సత్కరించారు. అనంతరం కోటి రామాయణ పుస్తకాలు, సీతారాముని విగ్రహమూర్తులను హనుమాన్ వాహనంపై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. మహిళల కోలాటం, శ్రీరామనామ భజన ఆకట్టుకున్నాయి. ఉపనిషన్మందిరం, శ్రీరామసేవా సమితి, అనంత భారతి ఆర్ష విజ్ఞాన వాటిక, రుద్రవాహిని, సేవా భారతి, కుటుంబ ప్రబోధన్, ఇతర దేవాలయాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాస్కరభట్ల శ్రీరామశర్మ, పి.వి.రమణమూర్తి, విశ్వనాథం కామేశ్వరరావు, కనుగుల సత్యం, బండారు వెంకటలక్ష్మీ, నేరెళ్ల విజయలక్ష్మీ, వెంకటలక్ష్మీ, కె.రమాదేవి, నీరజా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వండి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై హరికృష్ణరావు

ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం : తీరంలో అజ్ఞాత వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ (మెరైన్) ఎస్సై గురుగుబెల్లి హరికృష్ణరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగుట్లపాలేం, బడివానిపేట, డి.మత్స్యలేశం, రణస్థలం మండలం కొమరవానిపేట తదితర తీర గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. గ్రామపెద్దలు, మత్స్యకారులు, సాగర్ మిత్ర, గ్రామ విజిలెన్స్ కమిటీ సభ్యులతో భేటీ అయ్యారు. తీరంలో గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే 1093, ఫోన్ నంబర్ 9392914712కు సమాచారం ఇవ్వాలని కోరారు. వేట నిషేధకాలంలో మోటర్ బోట్లు వినియోగించవద్దని, సంప్రదాయ బోట్లతో మాత్రమే వేట సాగించాలని సూచించారు. ఉగ్రవాదులు సముద్ర తీరం వెంబడి ప్రవేశించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

ఏఎన్‌ఎంల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

జి.సిగడాం: పల్లె ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న ఏఎన్‌ఎంలపై ఇటీవల సమ్మెలో పాల్గొన్న ఎంఎల్ హెచ్‌పీలు చేసిన వాఖ్యలపై జి.సిగడాం, బాతువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఏఎన్‌ఎంలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వైద్యులకు వినతిపత్రాలు అందించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

రణస్థలం : రణస్థలంలోని యూబీ పరిశ్రమ సెక్యూరిటీ గార్డు తోలాపు శంకరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సంతకవిటి మండలం మద్దూరి శంకరిపేటలో ఉంటున్న అతని కుటుంబానికి యూబీ సెక్యూరిటీ స్టాఫ్, యూబీఎల్ ఎంప్లాయిస్ కలిపి సేకరించిన లక్ష రూపాయలను మంగళవారం అందజేశారు.

అమ్మో.. ఎచ్చెర్లా..!

- ఎంపీడీఓగా వచ్చేందుకు ఆసక్తి చూపని అధికారులు
- గాడిన పడని పాలన



ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం నగర పాలక సంస్థకు సరిహద్దునే ఉన్న మండలం ఎచ్చెర్ల. శ్రీకాకుళం పట్టణంలో నివాసం ఉంటూ ఇక్కడ విధులు నిర్వర్తించే సౌలభ్యం ఉంటుంది. అయితే ఇక్కడ మాత్రం ఎంపీడీఓగా పనిచేసేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో మారుమూల మండలాలకు వెళ్తాం తప్ప ఎచ్చెర్ల మాత్రం ప్రిఫర్ చేయడం లేదు. కనీసం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తించేందుకు సైతం ఎవ్వరూ ముందుకురావటం లేదు. దీంతో విధానపరమైన నిర్ణయాలు ముందుకు సాగడం లేదు. పాలన గాడిన పడటం లేదు. ఎంపీడీవో కార్యాలయం సేవలు కూడా అరకొరగానే అందుతున్నాయి.

లాంగ్‌లీవ్‌లో రెగ్యులర్ ఎంపీడీఓ..

ఎచ్చెర్ల మండల రెగ్యులర్ ఎంపీడీవో సీపాన హరిహరరావు మార్చి 4న లాంగ్‌లీవ్ పెట్టారు.మెడికల్ లీవ్ ఏప్రిల్‌తో ముగిసినా లీవ్ ఎక్స్‌టెన్షన్, లేదా స్థానచలనం కావాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేసినట్లు సమాచారం. జిల్లాలో సీనియర్ ఎంపీడీవో ఈయన. మరో రెండేళ్ల లోపు మాత్రమే సర్వీస్ ఉంది. పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తిగా పట్టు ఉంది. ఇటువంటి వ్యక్తి విధులు సక్రమంగా నిర్వర్తించలేని పరిస్థితి ఉన్న ఈ మండలానికి ఇతర అధికారులు వచ్చేందుకు ఆసక్తి చూపటం లేదు. గ్రామసభ, మండల పరిషత్ తీర్మానం చేసిన ఉపాధి మెటీరియల్ కాంపొనెంట్ పనులు కాదని కూటమి నాయకుల సిఫారసుకు వర్క్ ఆర్డర్ ఇవ్వడం.. పనుల నాణ్యత, వర్క్ ఆర్డర్ నిబంధనలపై ఇతర అంశాలపై ఎంపీపీ చిరంజీవి హైకోర్టులో కేసు వేయడం తదితర అంశాలతో ఇక్కడ వ్యవహారం గజిబిజిగా మారింది. రణస్థలం ఎంపీడీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చినా తీసుకునేందుకు ఆయన ముందుకు రాలేదు. చివరకు ఈవోపీఆర్‌డీ బత్తుల మల్లేశ్వరరావును ఇన్‌చార్జిగా నియమించినా.. ఈయన గతంలో టెక్కలి పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా 2023-24లో పని చేసి కాలంలో అవినీతి ఆరోపణపై ఈ నెల 2న సస్పెండయ్యారు. దీంతో ఎంపీడీవో లేని మండలంగా ఎచ్చెర్ల మిగిలిపోయింది. ఫలితంగా బీసీ కార్పొరేషన్ యూనిట్లు, టైలరింగ్ శిక్షణ లబ్ధిదారుల ఎంపిక తదితర పనులు నిలిచిపోయాయి.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు టి.తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం మున్సిపల్ స్కూల్ స్వీపర్లు, ఆయాలు, వాచ్‌మెన్ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4వేల జీతంతో ఎలా బతకాలో ప్రభుత్వ పెద్దలే చెప్పాలని కోరారు. తక్షణమే కనీస వేతనం రూ.21వేలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పి.వి.డి.ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు టి.పార్వతి, షేక్ భాను, ఎం.రవణమ్మ, కుమారి, జయమ్మ, కె.లక్ష్మి, ఎం.పార్వతీ, వరలక్ష్మి, శ్రీను, పాపారావు, కిషోర్, రాము తదితరులు పాల్గొన్నారు.